క్లుప్తంగా

నేడు ఆదరణ పథకంపై సమావేశం

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలోని ఎంపీడీఓ కార్యాలయం సభాభవనంలో బీసీ కులాలు కులవృత్తులు, చేతి వృత్తులకు సంబంధించి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆదరణ–3 పథకంపై ఆ సంఘ నాయకులుతో సమావేశం నిర్వహిస్తున్నట్టు గురువారం ఎంపీడీఓ ఫణిరాజకుమారి తెలిపారు. సమావేశానికి బీసీ ఉప కులాలకు చెందిన వారు, బీసీ సంఘాల నాయకులు తప్పకుండా హాజరై వారి వృత్తికి కావలసిన ఆధునిక పనిముట్ల ఆవశ్యకతను తెలియజేయాలని ఆమె అన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీపీఓ రాజ్యలక్ష్మి

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట పంచాయతీ కార్యదర్శి సుధాకర్ సహకారంతో ముద్రించిన స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్ పోస్టర్లను గురువారం కడప డీపీఓ కార్యాలయంలో జిల్లా పరిషత్ అధికారి రాజ్యలక్ష్మి ఆవిష్కరించారు. ఒంటిమిట్ట గ్రామ పంచాయతీలో ఇంటింటికి చెత్త సేకరణలో భాగంగా తడిచెత్త, పొడిచెత్త సేకరణలో భాగంగా తడిపొడి చెత్తను వేరుచేయు విధానంపై పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ పోస్టర్లను ముద్రించారు. అలాగే స్థానిక పీహెచ్‌సీ గోడలపై స్లొగన్స్‌ను కూడా రాయించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ పరిపాలనాధికారి ఖాదర్ బాషా, ఒంటిమిట్ట ఈఓపీఆర్‌డీ కెఆర్ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామాపురం : మండల పరిధిలోని కేజీబీవీలలో 2025 – 26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు బాలికల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ పుష్పలత పేర్కొన్నారు. దరఖాస్తులు ఈనెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11 వరకు చేసుకోవచ్చని చెప్పారు. అనాథలు, బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన విద్యార్థులు) పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే అడ్మిషన్‌కు పరిగణించబడతాయని తెలిపారు.

నమ్ముకున్న కుటుంబానికి తనవంతు బాధ్యతగా..


ఆర్థికసాయం అందజేస్తున్న గాలివీటి వివేకానందరెడ్డి

వీరబల్లి : నమ్ముకున్న కుటుంబానికి అండగా నిలిచాడు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గాలివీటి వివేకానందరెడ్డి. వివరాల్లోకి వెళితే కదిరయ్య అనే వ్యక్తి గాలివీటి వివేకానందరెడ్డి కుటుంబంపై ఆధారపడి జీవిస్తున్నాడు. ఇటీవల కదిరయ్య కుమార్తెకు వివాహం నిశ్చయమైంది. తమ కుటుంబాన్నే నమ్ముకుని ఉన్న వ్యక్తి ఇంట్లో శుభకార్యం జరుగుతుండటంతో స్పందించిన వివేకానందరెడ్డి గురువారం కదిరయ్య కుమార్తె, ఆమె సోదరుడికి రూ.లక్ష ఆర్థికసాయాన్ని రాయచోటిలోని ఆయన కార్యాలయంలో అందజేసి పెద్దమనసును చాటుకున్నాడు. దీంతో కదిరయ్య కుటుంబసభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రంజాన్‌ను సంతోషంగా జరుపుకోవాలి


చీరలు పంపిణీ చేస్తున్న బేపారి మహమ్మద్‌ఖాన్

రాయచోటి అర్బన్ : రంజాన్ పర్వదినాన్ని ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్ అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకుని పట్టణంలోని కొత్తపల్లె, ఈద్గా ప్రాంతాల్లోని సుమారు 500 మంది పేదమహిళలకు కుల,మతాలకతీతంగా చీరలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేదలందరూ సంతోషంగా పండుగను జరుపుకోవాలన్న ఉద్దేశంతో చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పెద్దరాత్రి రోజున మరికొంతమంది మహిళలకు చీరలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

ప్రపంచ భాష ఇంగ్లీషు

కురబలకోట: విద్య, ఉద్యోగ, ఉపాధిలలో రాణించాలంటే ఇంగ్లీషు కీలకమని అంగళ్లులోని విశ్వం విద్యా సంస్థల అధినేత ఎం.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బీటెక్ విద్యార్థులకు జరిగిన ఓ కార్యక్రమంలో గురువారం ఆయన మాట్లాడుతూ మేధా చిరంజీవి హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారన్నారు. గ్రామర్‌తో పాటు సులభంగా ఇంగ్లీషు ఎలా మాట్లాడాలో నేర్పించారని తెలిపారు.

నిప్పు.. ముప్పు..


చిన్నమండెం మండలం వండాడి వద్ద రగులుతున్న కార్చిచ్చు (ఫైల్)

- పండ్ల తోటల రైతులూ తస్మాత్ జాగ్రత్త
- ఆకతాయిల చేష్టలతో తీరని నష్టం

రాయచోటి జగదాంబ సెంటర్ : వేసవి సీజన్ ఆరంభమైంది. పచ్చిక ఎండిపోతోంది. ఇలాంటి సమయంలో ఆకతాయిలు, తాగుబోతులు ఎండుగడ్డికి నిప్పు పెడుతున్నారు. ఆ నిప్పు సమీపంలోని పండ్ల తోటలకు వ్యాపించడంతో పంటలు బుగ్గిపాలవుతున్నాయి. రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా పలు చోట్ల కొండ ప్రాంతాలు ఉన్నాయి. ఎక్కడో ఒక చోట ఎండుగడ్డికి నిప్పు పెడుతుండటంతో రోజుల తరబడి కొండ ప్రాంతాలు కాలుతూ బుగ్గి పాలవుతున్నాయి.

కార్చిచ్చుతో ప్రాణాలు కోల్పోతున్న వన్యప్రాణులు

రాయచోటి నియోజకవర్గంలో రామాపురం, చిన్నమండెం, గాలివీడు, సంబేపల్లె, లక్కిరెడ్డిపల్లె మండలాల్లో అడవి పందులు, జింకలు, నెమళ్లు, కుందేళ్లు ఎక్కువగా ఉన్నాయి. ఆకతాయిలు నిప్పు పెడుతుండటంతో రోజుల తరబడి అటవీ సంపద కాలిపోవడమే కాకుండా అటవీ జంతువులు మంటల్లో కాలిపోతున్నాయని పలువురు రైతులు తెలుపుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వేసవి సమీపించడంతో పండ్ల తోటల రైతులు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా పొలం గట్ల వెంబడి ఎండు గడ్డి తొలగించుకోవాలి. పండ్ల తోటల సమీపంలో మద్యం సేవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వేసవి పూర్తయ్యే వరకు రైతులు అప్రమత్తంగా ఉండాలి.

తాగుబోతులతో నష్టాలు

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మద్యం అమ్మకాలు ఎక్కువయ్యాయి. మద్యం ప్రియులు ఎక్కడపడితే అక్కడ మద్యం తాగుతున్నారు. ముఖ్యంగా పొలాల సమీపంలోనే మద్యం తాగుతూ.. సిగరెట్, బీడీ తాగి ఆర్పకుండా నిర్లక్ష్యంగా పడేస్తుండటంతో ఎండు గడ్డి అంటుకుంటోంది. అదికాస్త కాలుతూ వచ్చి సమీపంలోని తోటలకు మంటలు వ్యాపిస్తున్నాయి. ఈ మంటల్లో మామిడి, అరటి, జామ తదితర తోటలు కాలిపోతున్నాయి. దీనికితోడు పొలాల్లో ఉన్న డ్రిప్పు, ప్లాస్టిక్ పైపులు, వ్యవసాయ పరికరాలు కాలిపోతున్నాయి. రైతులు అపారంగా నష్టపోతున్నారు.


చిన్నమండెం మండలంలోని నాగూరువాండ్ల పల్లెలో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది (ఫైల్)

నిప్పు పెడితే కఠినచర్యలు



అడవులకు నిప్పు పెట్టే వారిపై కఠినచర్యలు తీసుకుంటాం. ప్రజల సహకారంతో అటవీ సంపదను కాపాడుతాం. గ్రామాల్లో ఆకతాయిలు, గొర్రెల కాపరులు అడవులకు నిప్పు పెడుతుంటారు. అలాంటి వారిపై నిఘా ఉంచి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. అడవులకు నిప్పు పెట్టకుండా కాపాడుకునేందుకు గ్రామాల్లో అటవీ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నాం.

– వై.చంద్రశేఖర్‌రెడ్డి, ఎఫ్ఆర్‌ఓ, రాయచోటి

హాస్టళ్ల నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలి


లేడీస్ హాస్టల్ నిర్వాహకులకు సూచనలు చేస్తున్న మన్నూరు సీఐ కుళ్లాయప్ప

రాజంపేట : లేడీస్ హాస్టల్ నిర్వహించే వారు పకడ్బందీ చర్యలు తీసుకోవడమే కాక విద్యార్థుల సమగ్ర సమాచారంతో పక్కా రికార్డులు ఉండాలని మన్నూరు సీఐ కుళ్లాయప్ప అన్నారు. బోయనపల్లెలోని లేడీస్ హాస్టల్ నిర్వాహకులతో పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల, మోదుగుల కళావతమ్మ ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్న నేపథ్యంలో కడప–రేణిగుంట జాతీయ రహదారిలోని బోయనపల్లె వెంబడి లేడీస్ హాస్టల్ అనేకం ఉన్నాయన్నారు. విద్యార్థినుల భద్రతకు హాస్టళ్ల నిర్వాహకులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇందుకోసం హాస్టళ్లలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాల్సి ఉంటుందని తెలియజేశారు. గతంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకునే బాధ్యత నిర్వాహకులపై ఉంటుందన్నారు. నిర్వాహకులు కేవలం కమర్షియల్‌గా కాకుండా, విద్యార్థులు తీరుతెన్నులు, నడవడికలు, క్రమశిక్షణ లాంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. లేడీస్ హాస్టల్ తప్పనసరిగా రిజిస్టరు మెయింటెన్ చేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో మన్నూరు ఎఎస్ఐ సుబ్బయ్య పాల్గొన్నారు.

రూ.20 లక్షలకు సంత వేలం


వేలం పాటను నిర్వహిస్తున్న మండలాధికారులు

రామాపురం : మండల కేంద్రంలో వారంతపు శనివారం నిర్వహించే పశువుల సంత 2025–26 ఆర్థిక సంవత్సరంలో పశువుల సంతతోపాటు బస్టాండు గేటు వేలం గురువారం బహిరంగ వేలంపాటను నల్లగుట్టపల్లె సర్పంచ్ అయోధ్యపురం నాగభూషణ్ రెడ్డి ఆదేశాల మేరకు సొంత వేలం పాట నిర్వహించారు. పశువుల సంతకు కనపర్తి చంద్రశేఖర్‌రెడ్డి రూ.20 లక్షలు, బస్టాండ్ గేటు సాకే వెంకటరమణ రూ.1.60లక్షలు వేలం పాటలో దక్కించుకున్నారు. పెద్దవి ఆవు గేదెకు, ఎనుము, ఒక్కొక్క దానికి రూ.40లు చిన్నవాటికి రూ.20లు చొప్పున, పెద్దవి మేక, గొర్రెలకు రూ.25లు, చిన్న జీవాలకు రూ.10లు, బస్టాండు గేటుకు బస్సు లేక లారీ, టిప్పర్లుకు రూ.15లు, జీపు ట్రాక్టర్ ట్యాక్సీకి రూ.10లు, ఆటోలకు రూ.8లు చొప్పున, ఆర్టీసీ బస్సులు, ప్రభుత్వ వాహనాలకు మినహాయింపు ఉంటుందని డీపీఓ మస్తాన్‌వలి తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్‌రెడ్డి, ఈఓపీఆర్డీ పటాన్నయక్, పంచాయితీ కార్యదర్శి నాగరాజు, పంచాయితీ కార్యాలయం సిబ్బంది, వేలం పాటకు దారులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీలు ఆర్థికంగా స్థిరపడాలి


నందలూరు: మాట్లాడుతున్న ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ


గాలివీడు: అవగాహన కల్పిస్తున్న ఏఓ జాబీర్ అహ్మద్

నందలూరు : బీసీలు ఆర్థికంగా స్థిరపడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ రాధాకృష్ణన్, ఈఓపీఆర్‌డీ సునీల్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో చేతి వృత్తులు, కులవృత్తుల వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కులాలకు చెందిన చేతి వృత్తులు, కులవృత్తుల వారికి అవసరమైన అధునాతన పనిముట్లు వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేయడం జరుగుతుందన్నారు. ఆదరణ పథకం కింద వారి వృత్తికి అవసరమైన పనిముట్లు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, బీసీ కులానికి చెందిన వారు పాల్గొన్నారు.

గాలివీడు : మండలంలో ఉన్న అన్ని బీసీ కులవృత్తుల సంఘాల నాయకులతో ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సమావేశం ఏర్పాటు చేసినట్లు ఏఓ జాబీర్ అహమ్మద్ తెలిపారు. ఈ సమావేశంలో బీసీ కులవృత్తులలో నవీకరించిన పనిముట్లను అందజేసేందుకు వారి నుంచి కొత్త రకమైన పనిముట్లు జాబితాను తయారుచేసి జిల్లా అధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. అంతేగాక సంబంధిత కొత్తరకం పనిముట్లతో వారి ఆదాయం, నైపుణ్యం పెంపొందించుటకు ఈ పథకం రూపొందించబడిందని చెప్పారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు నాగేశ్వరావు, శ్రీకాంత్, వెంకట రమణ తదితర కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

నోటి శుభ్రతతోనే ఆరోగ్యానికి భద్రత


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మానస

కేవీపల్లె : నోటి శుభ్రతతోనే ఆరోగ్యానికి భద్రత అని పీలేరు సీహెచ్‌సీ దంత వైద్యనిపుణులు డాక్టర్ మానస అన్నారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని గురువారం మండలంలోని గర్నిమిట్ట పీహెచ్‌సీలో నోటి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దంతాలు, చిగుళ్లు, నాలుక ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోకపోతే దాని ప్రభావం శరీరంలోని ఇతర అవయవాలపై పడుతుందని తెలిపారు. మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. నోటి పరిశుభ్రతపై డెమో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అర్చన, పర్యవేక్షకులు భాగ్యలక్ష్మి, రమాదేవి, రుక్మిణి, పురుషోత్తం ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుడికి తీవ్రగాయాలు

మదనపల్లె : యంత్రం మీద పడి భవన నిర్మాణ కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన ములకలచెరువు మండలంలో జరిగింది. వేపూరికోట పంచాయతీ ఆవులపల్లెకు చెందిన శ్రీనివాసులు(50) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పక్క గ్రామమైన బండమీదపల్లెలో నిర్మాణంలో ఉన్న నూతన భవనానికి మోల్డింగ్ వేసేందుకు వెళ్లి రంపంతో కొయ్యలు కోస్తున్నారు. ప్రమాదవశాత్తూ యంత్రం కాలు మీద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు బాధితుడిని మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు.

లబ్ధిదారులు ధృవీకరణ పత్రాలు అందజేయాలి

వీరబల్లి : మండలంలో కొత్తగా ఇండ్లకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు తమకు సంబంధించిన రేషన్ కార్డు, ఆధార్ కార్డును సచివాలయం వద్దకు తీసుకెళ్లి డిజిటల్ అసిస్టెంట్ వద్ద ఆన్‌లైన్‌లో అనుబంధ పత్రం, ఆదాయ, కుల ధృవీకరణ పత్రం ద్వారా అప్‌లైచేసి సర్టిఫికెట్‌ను ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు వారంలోపు అందజేస్తే ఇండ్లు మంజూరు చేస్తామని హౌసింగ్ ఏఈ తెలిపారు. కావున లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

50 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు

సిద్దవటం : మండలంలోని రైతులు వ్యవసాయ పనిముట్ల కోసం రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి రమేష్‌రెడ్డి తెలిపారు. సిద్దవటంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. మందు పంపులు, ట్రాక్టర్ ఆధారిత పనిముట్లును 50 శాతం సబ్సిడీతో మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ అధినేతను కలిసిన నాయకులు


మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన నాయకులు

ఓబులవారిపల్లె : మండలానికి చెందిన టూరిజం డెవలప్‌మెంట్ మాజీ డైరెక్టర్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, చిట్వేలి వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చెవ్వు శ్రీనివాసులు రెడ్డిలు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో భేటి అయ్యారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో గురువారం వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించారు. వారి వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

మీ సేవ కేంద్రాల సర్వీసుల పునరుద్ధరణపై హర్షం


మాట్లాడుతున్న నాగేంద్ర బాబు

లక్కిరెడ్డిపల్లి : ప్రభుత్వం పలు సర్వీసులను తొలగించి సచివాలయాలకు కేటాయించగా ప్రస్తుతం తిరిగి పునరుద్ధరించడంపై పట్టణంలోని మీ సేవా కేంద్రాల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం మీసేవా సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగేంద్ర బాబు మాట్లాడుతూ మీ సేవా కేంద్రంలో సేవలకు సంబంధించి పలు సర్వీసులు తొలగించడం వలన ఆర్థికంగా తాము ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. అయితే తమకు తిరిగి సర్వీసులు పునరుద్ధరించడంపై చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

నల్లమందు పేలి ఒకరికి గాయాలు

కలకడ : నల్లమందు(ఆర్డీఎక్స్) పేలి వికలాంగుడు గాయపడిన సంఘటన గురువారం మండలంలోని బంగారువాండ్లపల్లె వద్ద జరిగింది. బాధితుడు, పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం, ఉండమల్లె గ్రామానికి చెందిన కె.రాము(45) కోన వద్ద క్వారీలో పనిచేస్తున్నాడు. గురువారం బండలు చీల్చడానికి వినియోగించే నల్లమందు ఆరబెట్టే పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు పేలిందని స్థానికులు తెలిపారు. రాముకు తీవ్ర గాయాలవడంతో 108లో ఆసుపత్రికి తరలించారు. కలకడ ఎస్ఐ రామాంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం వీడాలి


జ్యోతి గ్రామంలో పర్యటిస్తున్న ఎంపీడీఓ ఫణిరాజకుమారి

సిద్దవటం : మండలంలోని జ్యోతి గ్రామంలో అపరిశుభ్రత నెలకొని ఉండటంతో ఎంపీడీఓ ఫణిరాజకుమారి గ్రామ కార్యదర్శి, హరిత రాయబారులపై మండిపడ్డారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా జ్యోతి గ్రామంలో మీరు ఏమి చేశారని అన్నారు. గ్రామంలోని సీసీ రోడ్లకు ఇరువైపుల ఉన్న పేడదిబ్బలు, చెత్త కుప్పలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను శుభ్రం చేయాలని ఆదేశించారు. పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని తీరు మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామ సచివాలయంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి గ్రామంలో వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. అలాగే గ్రామంలోని గృహిణులు పొడిచెత్త, తడిచెత్తలను వేరు చేసి ప్రతి రోజు మీ ఇండి వద్దకు వచ్చే హరిత రాయబారుల వాహనంలో వేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బమ్మ, మండల విస్తరణ అధికారి మహతాబ్ యాస్మిన్, పీఆర్ ఏఈ నాగరాజు, ఉపాధి హామీ ఏపీఓ నరసింహులు, పంచాయతీ కార్యదర్శులు యాకోబ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం


పుల్లంపేట: శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న సీడీపీఓలు సౌభాగ్యమ్మ, సరళాదేవి


లక్కిరెడ్డిపల్లె: అంగన్ వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న ఎంఈఓ చక్రేనాయక్

ఓబులవారిపల్లె : అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని సీడీపీఓ సౌభాగ్యమ్మ పేర్కొన్నారు. గురువారం ముక్కావారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోషణ్ భీ, పడాయి (చదువు) భీ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజులపాటు జరిగే శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సౌభాగ్యమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా పిల్లలకు విద్యాబుద్ధులతోపాటు పౌష్టికాహారం, గర్భిణులు, తల్లుల సంరక్షణ చూడాలని వివరించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సరళాదేవి, మండల సూపర్‌వైజర్లు అనసూయమ్మ, ఎం.నిర్మల, కె.యశోద, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్ వాడీ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం

పుల్లంపేట : పుల్లంపేట మండలంలోని అంగన్ వాడీ సిబ్బందికి అనంతంపల్లి పాఠశాలలో అంగన్ వాడీ టీచర్లకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైల్వేకోడూరు సీడీపీఓ సౌభాగ్యమ్మ, సరళాదేవిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ 0 నుంచి 3 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు, 3 నుంచి 8 సంవత్సరాల వయస్సు పిల్లలకు పోషక ఆహారం, విద్య గురించి అంగన్‌వాడీ కేంద్రాలలో తీసుకోవాల్సిన చర్యలు, అలానే పిల్లల నైపుణ్యతను పెంచుకోవడానికి, దివ్యాంగుల పిల్లలను ఎలా గుర్తించాలి, పిల్లల పెరుగుదలకు చేపట్టాల్సిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మణెమ్మ, నిర్మలా దేవి, ఎం.జయలక్ష్మమ్మ, సుబ్బలక్షుమ్మ, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లిలో..

లక్కిరెడ్డిపల్లి : పోషణ భీ పడాయి భీ కార్యక్రమపై అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి, ఎంఈఓ చక్రే నాయక్‌లు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషణ్ భీ పడాయి భీ కార్యక్రమంపై నవచేతన, ఆదర్శ విద్యా విధానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. ఆదర్శంగా విద్యా విధానం 2024లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. మేథ, శారీరక, భాషా అభివృద్ధిలతోపాటు సామాజిక భావోద్వేగ, సాంస్కృతిక, కళాత్మక అభివృద్ధి గురించి నేర్పించాలన్నారు. కార్యక్రమలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దాద్ బీ, లక్ష్మీదేవి, సుజాత, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి విధేయుడు ఆకేపాటి అనిల్‌రెడ్డి


కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

రాజంపేట టౌన్ : పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి సోదరుడు, వైఎస్సార్ సీపీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకేపాటి అనిల్‌కుమార్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని తమ ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు జెనుగు కృష్ణారావుయాదవ్ మాట్లాడుతూ అనిల్‌కుమార్‌రెడ్డి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విధేయుడిగా ఉంటూ పార్టీకి, ప్రజలకు తనవంతు విశేష సేవలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు జెనుగు కృష్ణారావుయాదవ్, శివారెడ్డి, మౌలాలి రెడ్డి, దండు గోపి, నాగాశేఖర్‌రెడ్డి, దాసరి పెంచలయ్య, వేణుగోపాల్ రెడ్డి, జీవీ సుబ్బరాజు, శ్రీనివాసులు, చిట్వేలి జ్యోతికృష్ణయాదవ్, జాహిద్ అలీ, మసూద్, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో చలివేంద్రాలు ఎంతో అవసరం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ తదితరులు

ఒంటిమిట్ట : వేసవిలో చలివేంద్రాల అవసరం ఎంతో ఉందని ఒంటిమిట్ట మండల ఈఓపీఆర్‌డీ కెఆర్ఎం ప్రసాద్, ఒంటిమిట్ట పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఒంటిమిట్ట సర్పంచ్ సుజాతలు అన్నారు. గురువారం స్థానిక సచివాలయ కార్యాలయం ఎదుట దాత యాపరాల నరసింహులు సహాయంతో చల్లని మినరల్ వాటర్ అందించే ఫ్రిజ్‌ను పెట్టి ఒంటిమిట్ట పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో ఈఓపిఆర్‌డీ కెఆర్ఎం ప్రసాద్, ఒంటిమిట్ట సర్పంచ్ సుజాతల చేతులమీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. దాత నరసింహులు తన తల్లి నారాయణమ్మ, సతీమణి తులసీల జ్ఞాపకార్థం ఈ చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట చెరువు సంఘం వైస్ చైర్మన్ యానాదయ్య, మాజీ సర్పంచ్ నరసింహులు, పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వర్ధంతి సభలను జయప్రదం చేయండి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

రాజంపేట టౌన్ : ఈనెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్, షాహిద్‌ల 94వ వర్ధంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నేతి నాగేశ్వరరావు తెలిపారు. వర్ధంతి సభల పోస్టర్‌లను గురువారం పీడీఎస్‌యూ నాయకులు రాజంపేటలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుంచి మాతృభూమికి విముక్తి కల్పించేందుకు వారి ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని తెలిపారు. ఈ నెల 23న రాజంపేట పట్టణంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద జరిగే సభలో యువత, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు వినోద్, పృథ్వీ, నంద తదితరులు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు

పీలేరు : బాల కార్మికులను పనిలో పెట్టుకునేవారిపై చర్యలు తప్పవని లేబర్ ఆఫీసర్ ఆనందబాబు హెచ్చరించారు. గురువారం పీలేరు పట్టణంలో పాన్ ఇండియా బాల కార్యక్రమం, కార్మిక నిర్మూలన, పునరావాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ షాపుల యజమానులకు అవగాహన కల్పించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే రూ. 20 వేల నుంచి రూ. 50 వేల జరిమానాతోపాటు ఆరు నెలల నుంచి రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు గట్టప్ప, రాజమ్మ, లావణ్య, రాణమ్మ, రూప పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలు తొలగింపు


చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డుకు ఇరువైపులా పొదలను గురువారం తొలగించారు. రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న పర్యాటకులకు పక్కనే ఉన్న మొక్కలు, చెట్ల కొమ్మలతో ఇబ్బందులు తలెత్తేవి. బైక్‌పై వెళ్లే వారి కళ్లకు కొమ్మలు తగిలి గాయాలయ్యేవి. దీనిపై రహదారి భవనాలశాఖ సిబ్బంది పొదలను, రోడ్డుపైకి వాలిన కొమ్మలను తొలగించి సౌకర్యం కల్పించారు.